76809 94755 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2016-18





# రాజధాని వార్తలు

Voice of Voiceless




అమరావతి సంపుటి : 3 సంచిక 50, పేజీలు 4 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ ' రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 3 - ఆదివారం 9 సెప్టెంబర్, 2018

## చంద్రబాబు కు ఐక్యరాజ్యసమితి ఆహ్వానం



**రాజధాని వార్తలు, అమరావతి :** ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఐక్యరాజ్య సమితి నుంచి ఆహ్వానం అందింది. సెప్టెంబర్ 24న యుఎన్ సదస్సులో కీలక ఉపన్యాసం పంపారు. ఫైనాన్సింగ్ సస్టైయినబుల్ అగ్రికల్చర్ గ్లోబల్ చాలెంజెస్ అండ్ ఆపర్చునిటీస్ అంశంపై న్యూయార్క్‌లో జరిగే సదస్సులో ఆయన ప్రసంగించనున్నారు. జీరో బడ్జెట్, ప్రకృతి సేద్యంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను యుఎన్ ప్రశంసిచినట్టు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో సేంద్రీయ సాగు వృద్ధికి యుఎన్ఓ సాయం చేస్తోన్నట్టు పేర్కొన్నారు.

# ఉద్యమించిన ఉద్యోగులు





**రాజధాని వార్తలు ప్రతినిధి, విజయవాడ :** ఏపీ ప్రభుత్వ ఉద్యోగులు విజయవాడలో ఆందోళనకు దిగారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్)ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ భారీ ర్యాలీ తీశారు. 13 జిల్లాల నుంచి వచ్చిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు జింఖానా గ్రౌండ్‌లో ధర్నా నిర్వహించారు. తమ పెన్షన్ డబ్బుకు రక్షణ లేకుండా పోతుందని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ధర్నాకు వైసీపీ, కాంగ్రెస్ నేతలు మద్దతు తెలిపారు. మరోవైపు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేయాలంటో ఏపీలోని అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద ఉపాధ్యాయులు ధర్నాకు దిగారు. వాక్ ఫర్ పెన్షన్..వోట్ ఫర్ పెన్షన్

### సీపీఎస్ రద్దుకు కలెక్టరేట్ల ముట్టడి

నినాదంతో ప్రభుత్వ ఉద్యోగులు విజయవాడ నగరంలో రైల్వేస్టేషన్ నుంచి ధర్నాచౌక్ వరకు భారీ ర్యాలీ తీశారు. సీపీఎస్ రద్దుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలంటూ నినాదాలు చేశారు. అసెంబ్లీ తీర్మానం పేరుతో ప్రభుత్వం మోసం చేస్తోందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 1980 పెన్షన్ రూల్స్‌ను పునరుద్ధరిస్తూ కొత్త జీవో విడుదల చేయాలని డిమాండు చేశారు. అక్టోబర్ 2లోగా పరిష్కరించపోతే అక్టోబర్ 10 నుంచి ఆమరణ నిరాహార దీక్షలకు దిగుతామని హెచ్చరించారు.

## వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిక...





- పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన వసంత వెంకట కృష్ణ ప్రసాదు
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపు యువత ఆసక్తి....

**రాజధాని వార్తలు, మైలవరం :** మైలవరం నియోజకవర్గం ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి గ్రామానికి చెందిన పాలుగోత్తు నరసింహ నాయక్, మెగిలి విజయ్ కుమార్ తమ అనుచరులతో కలిసి వసంత కృష్ణ ప్రసాదు గారి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లో చేరారు. కెపి గారు వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.... అనంతరం మాట్లాడుతూ మైలవరం నియోజకవర్గం పెద్ద ఎత్తున వలసలు వచ్చేందుకు ప్రజలు సిద్ధం గా ఉన్నారని అన్నారు. తొమ్మిదేళ్లు గా ప్రజలు అభివృద్ధి కి నోచుకోక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలుగుదేశం పాలన పట్ల మంత్రి దేవినేని ఉమా పనితీరు పట్ల ప్రజలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారని అన్నారు. రాజన్న రాజ్యం జగనన్న తోనే సాధ్యం అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మైలవరం నియోజకవర్గం లో సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు..

## వీక్లీ రౌండప్

- టాటా ట్రస్టు ఆధ్వర్యంలో తిరుపతిలో భారీ క్యాన్సర్ ఆస్పత్రి–ఎస్వీ క్యాన్సర్ అండ్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ భూమిపూజ చేసిన రతన్‌టాటా, ముఖ్యమంత్రి చంద్రబాబు.
- నిరుద్యోగ భృతి ఇచ్చేందుకు ఉద్దేశించిన ముఖ్యమంత్రి 'యువనేస్తం' పథకాన్ని ఒక వారం రోజుల్లో ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించనున్నారు.
- నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలను భాగస్వామ్యం చేయటానికి 'చేరువ' పథకం ద్వారా సామాజిక మాధ్యమాల ద్వారా పోలీసులకు మెసేజ్‌లను పంపవచ్చు

| | |
|---|---|
| వాట్సాప్ | : 9440900822 |
| ట్విటర్ | : appolicecheruva |
| ఫేస్‌బుక్ | : cheruva-ap-police |
| ఇన్‌స్టాగ్రామ్ | : appolice-cheruva |
| వెబ్ | : cheruva.appolice.gov.in |




- మంగళగిరిలోని సి.కె. కన్వెన్షన్ హాల్లో రాష్ట్ర ఉపాధ్యాయ దినోత్సవాన్ని (5వ తారీకున) నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.
- 11వ వేతన సవరణ సంఘం దరఖాస్తుల స్వీకరణ గడువును సెప్టెంబరు 20వ తేదీ వరకు పొడిగించినట్లు ఆ సంఘం కార్యదర్శి పాపారావు తెలిపారు.
- సెప్టెంబరు మొదటి వారంలో ఏ.పీ. మంత్రివర్గ విస్తరణకు అవకాశం.
- విజయవాడ పుష్ప హోటల్ సెంటర్ దగ్గర సాయిభాస్కర్ ఆస్పత్రిని (ప్రముఖ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డా. భూసిరెడ్డి నరేంద్రరెడ్డి) పూర్వ పేషేంట్లుల చేతుల మీదుగా ప్రారంభించారు.
- ఏపీ ఆర్థికాభివృద్ధి మండలి సీఈవోగా జాస్తి కృష్ణకిశోర్ పదవీకాలం మరో రెండేళ్ల పాటు పొడిగించారు.
- 13న స్టేట్ స్ట్రీట్ హెచ్‌సీఎల్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రారంభం : విజయవాడ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుకు అభిముఖంగా 'మేధాటవర్' లో ఈ సంస్థ 900 మంది ఉద్యోగులతో తన కార్యక్రమాలను ప్రారంభించనున్నారు.
- సెప్టెంబరు 1నుండి 31 వరకు ఓటర్ల జాబితా పున:సవరణ, అభ్యంతరాలను తెలియచేయాలని ప్రధాన ఎన్నికల అధికారి తెలిపారు.
- రాష్ట్ర మంత్రి మండలి సమావేశం 6వ తేదీన 3గం.లకు జరుగుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ తెలిపారు.





అధికారులు, ప్రజాప్రతినిధుల గృహ సముదాయం




రాజధాని వార్తలు కలం

## ఆత్మవిమర్శ చేసుకోవాలి


ప్రజల భావోద్వేగాలను పరిగణలోకి తీసుకొని నాయకులు సంయమనంతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది. కఠిన పరిస్థితులు తలెత్తినప్పుడు వాటిని పరిష్కరించే తీరులోనే నాయకుల సమర్థత వెలికి వస్తుంది. ఆగస్టు 28న జరిగిన 'నారా హమారా–టీడీపీ హమారా కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా, **'వక్ఫ్ఆస్తుల పరిరక్షణ ఎక్కడ?'**
**'టీడీపీలో ముస్లిం నాయకత్వాన్ని మరిచిన చంద్రబాబు'**
**'నాలుగు జిల్లాల్లో ఉర్దూ మీడియం పాఠశాలలు ఎక్కడ'**
**'ఎన్నికల ముందు మేం ఎందుకు గుర్తొచ్చాం'**
ప్లకార్డులను ముస్లిం యువత ప్రదర్శించింది. దీంతో అధికార పార్టీ అసహనం ప్రదర్శించగా, పోలీసులు దురుసుతో ప్రవర్తించి మెడపట్టుకొని బయటకు గెంటేశారు. ప్లకార్డులు లాక్కొని చించేశారు. ఇవన్నీ వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇక్కడే అధికార పార్టీ వారి నాయకుడు ఆవేశంతో వివేచన మరిచారు. నిజానికి వారిలో ఒకరిని స్టేజ్‌పైకి పిలచి, వారిని మాట్లాడమని వారి బాధను అర్థం చేసుకున్నామని, ఇకపై ఇలాంటి పోరబాట్లు చేయబోమని ప్రకటించి ఉంటే 'నారా హమారా' సూపర్ సక్సెస్ అయి ఉండేది. ఇది కొత్తగా చెబుతున్న విషయం కాదు ఇలాంటి పరిస్థితుల్లో అంతకుముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇలాగే వ్యవహరించారు. అధికారం ఉందని వారిపై లాఠీలు ఝుళిపించి, వారిపై వేర్పాటువాదులుగా ముద్రవేసి వారిని వేధించడం ఎంతవరకు సబబుగా ఉంటుందో ఒక సారి అధికార పక్షం ఆలోచించడం మంచిది.

కరడుగట్టిన హిందూత్వవాది ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ బీజేపీ ప్రభుత్వంలో కూడా మైనార్టీ మంత్రిగా మొహిసిన్ రజా ఉన్నారు.. దేశంలోనే ముస్లింలకు మంత్రి పదవుల్లో ప్రాతినిధ్యం లేకుండా చేసిన వారిలో చంద్రబాబే ఉన్నారు. రంజాన్ తోఫా పేరుతో చౌకదుకాణాల్లో సేమ్యాలు, బెల్లం పంచి ముస్లింల ఇళ్లల్లో వెలుగులు నింపుతున్నామనడం, పార్టీలోని ముస్లింలను కూడా స్టేజ్‌పైకి తీసుకురాకుండా, ఆయన, వారి మిగతా మంత్రులు, ముస్లిం టోపీలు పెట్టుకొని హడావుడి చేయడం ఎబ్బెట్టుగా ఉంటుందని చెప్పక తప్పదు. రాష్ట్రంలో అనేకమంది మైనార్టీలు ఉన్నా ముస్లిం మైనార్టీ వర్గమే అతిపెద్దది. అటువంటి వర్గానికి మంత్రివర్గంలో చోటు లేకపోవడం ఖచ్చితంగా ప్రశ్నించే అంశమే..సభలో క్రియాశీలమైన నిర్దిష్టమైన హామీలు లేకుండా... ఉన్నవాటినే కొత్తగా ప్రకటిస్తూ... ఆ వర్గాన్ని ముఖ్యమంత్రి తీవ్ర అసంతృప్తికి లోను చేశారన్నది మాత్రం వాస్తవం. దీనిపై ముఖ్యమంత్రి, మిగతా మంత్రివర్గం ఆత్మవిమర్శ చేసుకోవాలి. రాష్ట్రంలో మరో ఆరునెలల్లో ఎన్నికలు జరగబోతుండగా, ముస్లింల కోసం సభ ఏర్పాటు చేసి వారినే బాధితులుగా చేస్తే అధికార వర్గానికి అంతకంటే వైఫల్యం మరొకటి ఉండబోదు.. సచివాలయం లీకులైనా, సభల్లో ప్లకార్డులు ప్రదర్శించినా దీనిని ప్రతిపక్షంపై రుద్దటం ఏమంత సబబుగా ఉండదు. ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు సంయమనం పాటించి ఎదుటివారిని నొప్పించకుండా భరోసా కల్పించడం ప్రభుత్వ విధి. అలాంటి చర్యలు తీసుకోకుండా ముస్లిం యువకులను అక్రమంగా అరెస్టు చేసి, వారి దుస్తులు విప్పించి లాఠీలకు పనిచెప్పి, మా వర్గానికి పదవులొద్దు.. ప్రాతినిధ్యం వద్దు.. మాపిల్లలను విడిపించండి చాలు అని వారి తల్లిదండ్రులు ప్రాధేయపడేలా బాధించడం అమానుషం. మూడురోజుల అనంతరం గుంటూరు అడ్వకేట్ షేక్ హబీబుల్లా ఆధ్వర్యంలో వారికి బెయిలు వచ్చింది. మంత్రులు ప్రజాసంక్షేమానికి కృషి చేయాలని కాని, కొన్ని వర్గాలపై వేధింపులు జరపడం సరికాదు.
ఈ ఘటనపై జూపల్లి ప్రభాకర్ స్పందిస్తూ, ప్రతిపక్షం మతకలహాలను రేపడానికి ప్రయత్నిస్తోందని అనడం ఏమాత్రం ఆమోద యోగ్యంకాదు.. సోషల్ మీడియాలో వైరల్ అయిన దృశ్యాలను బట్టి అక్కడ అంతటి దారుణఘటనలు జరగలేదు.. ముస్లిం యువకులు నాలుగేళ్లుగా తమ వర్గానికి ప్రాతినిధ్యం లేదని ప్లకార్డులు మాత్రమే ప్రదర్శించారు. గోరంత విషయాన్ని కొండంత చేయడం అమాత్యులకు తగదు.. త్వరలో లక్షమంది ముస్లిం, క్రిస్టియన్లతో సభనిర్వహిస్తానడం ప్రజా ధనం దుర్వినియోగమే.. ఒక వేళ సభ నిర్వహించినా దళిత క్రైస్తవులపై జరిగే దాడులను ఈ సారి సభలో ప్రశ్నిస్తే మళ్లీ కథ మొదటికి వచ్చే ప్రమాదం ఉంది.




## సావిత్రిబాయి ఫూలే జయంతిని
# ఉపాధ్యాయ దినోత్సవంగా జరపాలి

**భా**రతీయ ప్రప్రథమ మహిళా సంఘ సంస్కర్త, రచయిత్రి, ప్రథమ మహిళా ఉపాధ్యాయని, సామాజిక విప్లవకారిణి, నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన సావిత్రిబాయి ఫూలే జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరపాలని నెటిజన్లు కోరుతున్నారు. ప్రసిద్ధ సంఘసంస్కర్త జ్యోతీరావ్ ఫూలే భార్య. సావిత్రిబాయి కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి, విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన సావిత్రిబాయి భర్తతో 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించారు. కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యుల, మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటం తమ సామాజిక బాధ్యతగా ఆ దంపతులు విశ్వసించారు. నూతన వ్యవస్థ కోసం, ప్రాణాల్ని సైతం ఫణంగా పెట్టి సమష్టిగా పోరాటం చేసారు.
సావిత్రిబాయి ఫూలే మహారాష్ట్ర సతారా జిల్లాలో నయాగావ్ అనే గ్రామంలో 1831 జనవరి 3 న జన్మించారు. ఆమెది రైతుకుటుంబం. సావిత్రి బాయి కుటుంబానికి తెలంగాణ ప్రాంతంతో బంధుత్వం ఉంది. వీరి బంధువులు నిజామాబాద్ జిల్లాలో బోధన్ నాందేడ్ కొండల్ వాడి ప్రాంతంలో, ఆదిలాబాద్ చుట్టుపక్కల ఉన్నారు. సావిత్రి బాయి తన 9వ యేట 12 ఏళ్ల జ్యోతిరావు ఫూలెను 1840లో వివాహమాడారు. ఆ దంపతులకు పిల్లలు లేరు. కానీ ఆ జంట యశ్వంతరావు (బ్రాహ్మణ వితంతువు కుమారుడు) ను దత్తత తీసుకున్నారు.
"జ్యోతీరావు ఫూలె" ప్రోత్సాహంతోనే ఆమె ఇంట్లోనే అక్షరాభ్యాసం చేసి విద్యావంతురాలైంది. అహ్మద్‌నగర్‌లో ఉపాధ్యాయునిగా శిక్షణ పొంది 1848 లో భర్త జ్యోతిరావుతో కలిసి క్రింది కులాల బాలికల కోసం పూణేలో మొదటి పాఠశాలను ప్రారంభి,విద్యా ఉద్యమానికి శ్రీకారం చుట్టిన ధీరవనిత సావిత్రీబాయి.అట్టడుగు వర్గాలు, మహిళలకు చదువు, సంపద వంటి సమస్త హక్కులు నిరాకరింపబడిన దేశంలో ఆనాటి సమాజపు కట్టుబాట్లను, బ్రాహ్మణవాద సంప్రదాయాలను, ఆధిపత్యవర్గాలను ధిక్కరించి భారతదేశపు మొట్టమొదటి ఉపాధ్యాయురాలుగా పాఠశాలలు ప్రారంభించి,12 మే 1848న దేశంలో బహుజనుల,సమాజ ఉద్ధరణకు నడుం బిగించారు. సమాజంలో ఎన్ని అవమానాలు ఎదురైనా మడమ తిప్పని ధీశాలి ఆమె. కేవలం 4 సంవత్సరాలలోనే




గ్రామీణ ప్రాంతాల్లో 20 పాఠశాలలను ప్రారంభించి ఉచిత విద్యనందించారు. 1848 లోనే దేశంలో విద్యా ఉద్యమం ప్రారంభించిన మ్మొదటి మహిళ ఉపాధ్యాయురాలు, దళితుల, స్త్రీల విద్యావ్యాప్తికి కృషి ప్రారంభించే నాటికి ఆమె వయస్సు 18 ఏళ్ళు మాత్రమే. **వారి జీవితకాలంలో మొత్తం 52 పాఠశాలలు ప్రారంభించారు**. అయితే ఈ క్రమంలో ఆమె ఆధిపత్య కులాల వారి నుంచి అనేక దాడులు, అవమానాలతోపాటు ఫూలే, సావిత్రీబాయి దంపతులు గృహ బహిష్కారానికి గురయ్యారు.

**సామాజిక విప్లవకారిణిగా**
ఆమె మానవ హక్కుల గురించి ఇతర సామాజిక సమస్యల గురించి స్త్రీలను చైతన్యపరచడానికి 1852లో 'మహిళా సేవామండల్ 'అనే మహిళా సంఘన్ని కూడా స్థాపించింది. జెండర్ సమస్యలకు తోడుగా, కుల పితృస్వామ్య వ్యవస్థల అణచివేతకు వ్యతిరేకంగా స్త్రీల సాధికారిత కోసం ఈ సంస్థ కృషిచేసింది. **మహిళా హక్కులే మానవ హక్కులని తొలిసారిగా నినదించినది సావిత్రిబాయి ఫూలే.** అసత్యాలతో, అగ్రవర్ణ దురహంకారపు నిచ్చెనమెట్ల కులవ్యవస్థగా నిర్మాణమైన సమాజంలో "సత్యాన్ని" శోధించడానికి 1873 లో తన భర్త మహత్మా ఫూలేతో కలసి "సత్యశోధక్ సమాజ్ "ను ప్రారంభించి బాల్యవివాహలకు, మూఢనమ్మకాలకు, సతీసహగమనానికి వ్యతిరేకంగా, వితంతువు పునఃర్వివాహల కొరకు అసమాన బ్రాహ్మణిజ వ్యవస్థకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమం నడిపారు. బాల్యంలోనే వైధవ్యాన్ని అనుభవించే ఎంతో మంది ఆడపిల్లలను ఆదుకొని,. గర్భవతులైన వారికి పురుళ్ల పోసి వారి కళ్లల్లో వెలుగు చూసారు. అలా పురుడు పోసుకుని తన వద్దేవదిలేసి పోయిన ఓ బిడ్డను అక్కున చేర్చుకుని,యశ్వంత్ గా నామకరణం చేసి తమ ఆశయాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా పెంచి పెద్ద చేసారు. వితంతువులకు శిరోముండనం చేయడాన్ని తీవ్రంగా ఖండించి, క్షురకులను చైతన్యపర్చి, వితంతువులకు శిరోముండనం చేయబోమంటూ క్షురకుల చేత 1860లో సమ్మె చేయించారు సావిత్రీబాయి. "సత్యసోధక్ సమాజ్" అనే సామాజిక, ఆధ్యాత్మిక సంస్థను ప్రారంభించి, సత్యసోధన కోసం ఉద్యమాన్ని నడిపారు ఫూలే. ఈ 'సత్యశోధక్ సమాజ్ 'మహిళా విభాగం సావిత్రీబాయి నేతృత్వంలో నడిచేది. వివాహాలు వంటి శుభ కార్యాలను పురోహితులు లేకుండా నిర్వహించే విధానాన్ని ఈ సంస్థ ప్రారంభించింది. సావిత్రీబాయి అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడారు. 1870లో ఒకసారి 1896లో మరోసారి దేశంలో తీవ్ర దుర్భిక్షం ఏర్పడినప్పుడు ఫూలే దంపతులు చేసిన కృషి అనన్య సామాన్యం. కరువు వాతపడిన కుటుంబాలలోని అనాధ బాలలను దాదాపు 2,000 మందిని అక్కున చేర్చుకున్నారు. తమ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించినారు. సావిత్రిబాయి సంఘ సంస్కర్తగానే గాదు, రచయిత్రిగా కూడా వేగుచుక్కగా నిలిచారు. 1890 నవంబరు 28న మరణించడంతో సావిత్రీబాయి అంతులేని దుఃఖ సాగరంలో మునిగిపోయారు. ఈ దుఃఖంలోనుంచే మరో ఆదర్శానికి శ్రీకారం చుట్టారు. తన భర్త ఫూలే చితికి తానే స్వయంగా నిప్పుపెట్టి కొత్త సంప్రదాయానికి తెరలేపారు. భారతదేశ చరిత్రలో భర్త చితికి భార్య నిప్పు పెట్టిన తొలి సంఘటన ఇది. 1897 లో ప్లేగు వ్యాధి, పూణే నగరాన్ని వణికించింది. నగరమంతా ఎడారిగా మారింది. జనమంతా దగ్గర్లోని అడవుల్లోకి పారిపోయారు. అయినా సావిత్రీబాయి ఫూలే కొడుకు యశ్వంత్‌తో కలసి వ్యాధిగ్రస్తులకు సేవ చేసారు. చివరికి ఆ ప్లేగు వ్యాధే ఆమెకి సోకి మార్చి 10, 1897 లో మృతిచెందారు. ఆమె దత్తపుత్రుడు యశ్వంత్ అంత్యక్రియలు జరిపించాడు. **సావిత్రిబాయి జయంతిని భారతదేశ ఉపాధ్యాయుల దినోత్సవంగా జరుపుకోవాలని దేశం ఆకాంక్షిస్తోంది.**

# జననేత...రాజన్న



**యెడుగూరి సందింటి రాజశేఖరరెడ్డి (జూలై 8, 1949–సెప్టెంబర్ 2, 2009) ఆంధ్రప్రదేశ్ 16వ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకుడుగా ప్రపంచ ఖ్యాతిగాంచారు.**

1978లో తొలిసారిగా పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి శాసనసభలో అడుగుపెట్టిన రాజశేఖరరెడ్డి మొత్తం ఆరు సార్లు పులివెందుల నుంచి ఎన్నికల కాగా, నాలుగు సార్లు కడప లోక్‌సభ నియోజకవర్గం నుంచి పార్లమెంటులో అడుగుపెట్టాడు. ఆయన పోటీచేసిన ప్రతి ఎన్నికలలోనూ విజయం సాధించారు. జనతాపార్టీ ప్రభంజనాన్ని తట్టుకొని విజయం సాధించిన తొలి ఎన్నికల్లో వెంటనే మంత్రిపదవి పొందాడు. ఆ తరువాత వెనువెంటనే ముగ్గురు ముఖ్యమంత్రులు మారినా.. ఆ మూడు మంత్రి మండళ్లలో స్థానం సంపాదించాడు. ఆ తరువాత చాలా కాలం పాటు ఎటువంటి ప్రభుత్వ పదవీ దక్కలేదు. 1989–94 మధ్య ముఖ్యమంత్రి పదవి కోసం ప్రయత్నించినా అవకాశం రాలేదు. 1999లో మళ్లీ శాసనభకు ఎన్నికై ప్రతిపక్షనేతగా ఉంటూ తదుపరి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు వ్యూహం రచించాడు. 2003లో మండువేసవిలో 1460 కిలోమీటర్లు సాగిన పాదయాత్ర మరియు ఉచిత విద్యుత్ ప్రచారం అతని విజయానికి బాటలు పరచింది.

2004 ఎన్నికలలో పులివెందుల నియోజకవర్గం నుంచి 40వేలకు పైగా మెజారిటీతో విజయం సాధించడమే కాకుండా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మెజారిటీతో విజయం సాధించడమే కాకుండా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానాలు పొందడంతో ముఖ్యమంత్రి పీఠం వై.ఎస్.రాజశేఖరరెడ్డికే దక్కింది. ఆయన సెప్టెంబర్ 2, 2009న చిత్తూరు జిల్లాలో రచ్చబండ కార్యక్రమానికి హాజరవడానికి వెళ్తూ నల్లమల అడవులలో హెలికాప్టర్ ప్రమాదానికి గురై దుర్మరణం పాలయ్యాడు. వైఎస్ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన అవినీతిపై ఆయన మంత్రి వర్గ సభ్యులే కాకుండా కేంద్రమంత్రులు, ప్రస్తుత మంత్రులు, ప్రధాన ప్రతిపక్ష నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. రూ లక్ష కోట్ల అవినీతి జరిగిందని ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే మైసూరారెడ్డి లెక్కలువేయగా అప్పటి మంత్రి పి.శంకర్రావు వ్యాఖ్యలను కోర్టు సుమోటాగా స్వీకరించి విచారణ చేపట్టింది. వైఎస్సార్ కాలంలో అవినీతి జరిగిందని సీబీఐ ప్రాథమిక విచారణలో వెల్లడించింది. "క్విడ్ ప్రో కో" రూపంలో జగన్‌కు చెందిన కంపెనీలలో పెట్టుబడులు వచ్చినట్లు సీబీఐ చార్జిషీటులో పేర్కొంది.

**(సెప్టెంబర్ 2న వై.యస్. రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా)**

**ముఖ్యమంత్రిగా**
2004 మేలో జరిగిన 12వ శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాలు సాధించడంతో అదివరకే పార్టీలో పేరు సంపాదించిన వై.ఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించాడు. పాదయాత్ర వలన జనాదరణ పొందడమే కాకుండా ఎన్నికల ప్రచారంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు, పెండింగులో ఉన్న నీటి పారుదల ప్రాజెక్టులను పూర్తిచేయడం, జలయజ్ఞంలకు ప్రధాన్యం ఇవ్వడంతో ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన పిదప తొలి సంతకం ఉచిత విద్యుత్తు ఫైలు పైనే చేశాడు. 2009 ఏప్రెల్లో జరిగిన 13వ శాసనసభ ఎన్నికలలో కూడా కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానాలలో విజయం సాధించడానికి కృషిచేసి వరుసగా రెండో పర్యాయం ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టాడు.

**రాజకీయ జీవితం :** కళాశాల దశ నుంచే రాజకీయాలపై ఆసక్తి చూపిన రాజశేఖరరెడ్డి 1980– 83 కాలంలో రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రిపదవిని నిర్వహించారు. కడప లోక్‌సభ నియోజకవర్గం నుంచి నాలుగు సార్లు ఎన్నికయ్యాడు. పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 6 సార్లు విజయం సాధించాడు. రాష్ట్ర శాసనసభ ప్రతిపక్షనేతగానూ, రెండు సార్లు విజయం సాధించాడు. రాష్ట్ర శాసనసభ ప్రతిపక్షనేతగానూ, రెండు సార్లు రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగానూ పనిచేశారు. 1980 నుంచి 1983 దాకా గ్రామీణాభివృద్ధి, వైద్యుశాఖ, విద్యాశాఖ మొదలైన కీలకమైన మంత్రి పదవులను నిర్వహించాడు. తెలుగుదేశం నేత నారా చంద్రబాబు నాయుడు మొదటగా కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు ఇరువురూ మంచి మిత్రులు. 1985 నుంచి 1998 వరకు పార్టీలో వై.ఎస్. నిత్య అసమ్మతివాదిగా పేరుపడ్డారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రులందరితో ఆయన పోరాటం చేయాల్సి వచ్చింది. 1989–94 మధ్య కాలంలో ముఖ్యమంత్రి కావాలని ప్రయత్నించినా సాధ్యపడలేదు. మర్రి చెన్నారెడ్డి, నేదురుపల్లి జనార్ధన్ రెడ్డి, కోట్ల విజయ భాస్కర్ రెడ్డి వంటి నేతలతో ఆయన రాజకీయ యుద్ధమే చేశారు. వారికి వ్యతిరేకంగా క్యాంపులు నడిపాడు. మర్రి చెన్నారెడ్డి, నేదురు మల్లి జనార్ధన్‌రెడ్డిని పదవినుండి తొలగించడానికి ప్రధాన కారణమైన హైదరాబాదు నగరంలో జరిగిన అల్లర్లలో రాజశేఖర్‌రెడ్డి వర్గపు పాత్ర ఉందన్న ఆరోపణ వచ్చాయి. అదే తాను ముఖ్యమంత్రి అయ్యేనాటికి అలాంటి శిబారాలు లేని పరిస్థితిని సృష్టించుకోగలిగాడు. రాజకీయాల్లో ముక్కు సూచితనానికి, నిర్మొహమాట ధోరణికి రాజశేఖరరెడ్డి ప్రసిద్ధుడు.

**పీసీసీ అధ్యక్షుడిగా :**
ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా వై.ఎస్.రాజశేఖరరెడ్డి రెండు సార్లు పనిచేశాడు. తొలిసారి 1983 నుంచి 1985 వరకు మరియు రెండో పర్యాయం 1998 నుంచి 2000 వరకు ఆ పదవిలో ఉన్నాడు. 1999 నుంచి 2004 వరకు 11వ శాసనసభలో ప్రతిపక్షనేతగానూ వ్యవహరించాడు.

**పాదయాత్ర :** 2003 వేసవికాలంలో ప్రతిపక్షనేతగా ఉన్న సమయంలో పాదయాత్ర చేపట్టి 1,467 కిలోమీటర్లు పర్యటించాడు. పాదయాత్ర వలన వ్యక్తిగతంగా వైఎస్. కు మంచి జనాదరణ లభించడమే కాకుండా ఆ తదుపరి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి దోహదపడింది.

**మృత్యువాత :** సెప్టెంబర్ 2, 2009న చిత్తూరు జిల్లా పర్యటనకు బయలుదేరగా ఉదయం 9.35 నిమిషాలకు హెలికాప్టరుతో సంబంధాలు తెగిపోయాయి. ముఖ్యమంత్రి ఆచూకీ కోసం గాలించగా 25 గంటల తరువాత ప్రమాదానికి గురైన హెలికాప్టర్ ఆనవాళ్ళు లభించాయి. వై.ఎస్.తో సహా మొత్తం ఐదుగురు హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. తమ అభిమాన నాయకుడి మరణాన్ని జీర్ణించుకోలేక రాష్ట్ర మంతా దాదాపు 67 మంది మరణించారు. ప్రమాదస్థలమైన రుద్రకొండ కర్నూలు–ప్రకాశం జిల్లా సరిహద్దులో ఆత్మకూరు–వెలుగోడు కు సమీపంలోని నల్లమల ఆడవుల్లో ఉంది.

## నేడు తెలంగాణ బస్సులు రద్దు

**రాజధాని వార్తలు ప్రతినిధి విజయవాడ :** హైదరాబాద్,తెలంగాణ జిల్లాలకు వెళ్లేవారు ఆదివారం తమ ప్రయాణాలను వాయిదా వేసుకుంటే మంచిది. టీఆర్ఎస్ ప్రగతి నివేధన సభ సందర్భంగా తెలంగాణ బస్సులను అధికార పార్టీ అద్దెకు తీసుకోవడంతో తెలంగాణ బస్సులు రాష్ట్రంలోకి ప్రవేశించలేవు. దీన్ని గుర్తుంచుకొని ప్రయాణీకులు ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది. ఆదివారం పాఠశాలలకు, ప్రభుత్వ,ప్రైవేటు సంస్థలకు సెలవు కావడంతో ఆరోజు సభను ఏర్పాటు చేశామని, ఆరోజు ఎవరూ ప్రయాణాలు పెట్టుకోవద్దని మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఇప్పటికే ప్రజలకు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్, ఖమ్మం, తిరుపతి, కృష్ణాజిల్లాలోని నందిగామ, విజయవాడ, నెమలి, గంపలగూడెం, తిరువూరు తదితర ప్రాంతాలకు నిత్యం సర్వీసులు నడుస్తుంటాయి. అయితే ఆర్టీసీ బస్సులను మొత్తం టీఆర్ఎస్ సభకు నాయకులు అద్దెకు తీసుకోవడంతో డిపోలోవున్న మొత్తం 65బస్సులను హైదరాబాద్ సభకే కేటాయించారు. దీంతో ఆదివారం డిపో పరిధిలోని అన్ని రూట్లలో తిరిగే బస్సు సర్వీసులు మొత్తం రద్దు చేసినట్లు డిపో మేనేజర్ నారాయణ ప్రకటించారు. ఆదివారం తమ ప్రయాణాలను రద్దుచేసుకోని సహకరించాల్సిందిగా అధికారలు ఒక ప్రకటనలో కోరారు.




## రాజధాని రోడ్లు నరకానికి నకళ్లు

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** రాజధాని రోడ్లు నరకానికి నకళ్లుగా మారాయి. మొన్న కురిసిన వానలకు కొత్తరోడ్లు కొట్టుకు పోయాయి.మరీ ముఖ్యంగా గుంటూరు జిల్లా పెదకూరపాడు నియోజక వర్గంలోని రెండు ప్రధాన రహదారులైన రాజుపాలెం నుంచి అమరావతి, ఊటుకూరు నుంచి అచ్చంపేట రోడ్లు పూర్తిగా పాడయ్యాయి. ఆ రోడ్డుపై భారీ ఇసుక వాహనాలు తిరగడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని స్థానికులు వాపోతున్నారు. కొద్ది దూరంలో ఉన్న పాఠశాలలకు వెళ్లాలన్నా గతుకుల రోడ్డులతో రూ.25 నుంచి 40 వరకు ఆటోలకు పెట్టవలసి వస్తోందంటున్నారు. ఈ ప్రాంతంలో ఏపీఎస్ఆర్టీసీ,స్కూలు బస్సులు నడవకపోవడంతో ఈపరిస్థితి తలెత్తింది. ఈ ప్రాంతంలో ఇసుక తవ్వకాలు ఆపితే రోడ్ల పరిస్థితి బాగుపడుతుందని స్థానిక ఎమ్మెల్యే కొమ్మలపాటి శ్రీధర్ తెలిపారు. రాజుపాలెం – అమరావతి లైన్‌లోని రోడ్డు అత్యంత ముఖ్యమైనది. ఈ రోడ్డు రాజుపాలెం, బెల్లంకొండ, క్రోసూరు, అచ్చంపేట మండలాలను కలుపుతుంది. అయితే ఈ రోడ్లన్నీ ఇసుకు లారీలు,టిప్పర్లతో నిత్యం రద్దీగా ఉంటున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో ఆరోడ్లన్నీ దారుణంగా దెబ్బతిని గోతులు పడ్డాయి. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలను ఎదుర్కోవలసి వస్తుందని గుంటూరు రోడ్డు రవాణా సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ ఎన్ సుకన్య తెలిపారు. ఈ రోడ్డు నుంచి ప్రతిరోజు 3 వేల వాణిజ్య వాహనాలు ఇసుకను తీసుకెళుతున్నాయని, దీంతో తక్షణమే రోడ్డును విస్తరించి 31 కిమీ రోడ్డును నిర్మించాలని చెబుతున్నారు. అచ్చంపేట మండలంలోని ఊటుకూరు– కోనూరు రోడ్డు వెంబడి అనేక గ్రామాలు ఉండటంతోపాటు ఆరోడ్డు రాజధాని అమరావతికి అనుసంధానమైనందున తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. ఈ రెండురోడ్లను వెడల్పుచేయడంతోపాటు రెండు లైన్ల రోడ్డు నిర్మిస్తేనే ట్రాఫిక్ సమస్యలు తీరతాయని ఎమ్మెల్యే శ్రీధర్ చెబుతున్నారు. ఉటూకూరు–అచ్చంపేట 12 కిమీ రహదారి, ఊటుకూరు కోనూరు వయా కస్టాల 10 కిమీ రోడ్డులను విస్తరించి, మరమ్మతులు జరపడానికి ప్రభుత్వం కనీసం రూ. 80కోట్లు కేటాయించాలని అధికారులు అంచనా వేశారు.



## వాడవాడలా జనసేన జెండా ఆవిష్కరణ

**రాజధాని వార్తలు,ఐనవోలు :** తుళ్ళూరు మండలం ఐనవోలు యస్.సి కాలనీ నందు వాడవాడలా జనసేన జెండా ఆవిష్కరణ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా సమన్వయకర్త సయ్యద్ బాబు, విజయవాడ నాయకులు అమిజిత్ వాసు, గుంటూరు జిల్లా జనసేన నాయకులు సన్నిధి కిషోర్, ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. 500 మందికి అన్నదాన కార్యక్రమం జరిగింది. అనేకమంది మిత్రులతో జనసేన నాయకులు శివకృష్ణ, అజిత్, వెంకటేశ్వర్లు, నరేంద్ర, వెంకటేశ్వరావు, పాల్గొన్నారు.



**మీరూ స్పందించండి**
మీరు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలపై స్పందించండి
యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లేందుకు **రాజధాని వార్తలు** వేదికగా నిలుస్తుంది.
మీరు చేయాల్సిందల్లా సమస్యను ఫోటో తీసి, పరిస్థితిని క్లుప్తంగా
వివరించి వాట్సప్ ద్వారా మీ పేరుతో సహా
ఈ దిగువ ఉన్నవాట్సాప్ నంబర్లకు పంపించండి.
94406 62699

# ఫార్ములా కార్‌రేస్‌లో దూసుకుపోతున్న భారత మహిళలు

**ఫార్ములా కార్ రేసింగ్ అంటేనే మగవారి అడ్డా.. అందునా భారత దేశంలో దీనికి ప్రాతినిధ్యం వహించేవారు చాలా తక్కువ. తమిళనాడుకు చెందిన కార్తికేయన్ ఒక్కడే ఫార్ములా రేసర్‌గా పేరు తెచ్చుకున్నాడు.. తమిళ నటుడు అజిత్‌కూడా రేసర్‌గా అనేక పోటీల్లో పాల్గొన్నాడు.. ఇంతకుమించి అంతగా ప్రాధాన్యంలేని ఈ రంగంలోకి భారత మహిళలు దూసుకు పోవడం ఆనందాశ్చర్యాలను కలిగిస్తుందనడంలో సందేహంలేదు..**




ఆమె



అన్ని రంగాల్లో దూసుకుపోతున్న భారత మహిళలు ఫార్ములా కార్లను నడపడంలోనూ తమ ప్రతిభ చూపారు. మహిళా ఫార్ములా కార్ రేసర్ల బృందాన్ని ఎంపిక చేసుకునేందుకు తమిళనాడులోని కోయంబత్తూర్‌లో జూలై ఆఖరులో పోటీలు నిర్వహించారు. 60 మంది మహిళలు ఈ పోటీలో పాల్గొన్నారు. ఇందులో నుంచి ఆరుగురు మహిళలను ఎంపిక చేసుకున్నారు. జేకే టైర్ ఇంటర్నేషనల్ రేసింగ్ ఛాంపియన్‌షిప్ గెలుపొందిన సరోష్ హటారియా ఆధ్వర్యంలో గత ఏడాది ప్రొఫెషనల్ రేసింగ్ బృందం ప్రారంభమైంది. మహిళా ఫార్ములా రేసర్ల కోసం పోటీలో పాల్గొనే వారికి సాధారణ శిక్షణ ఇచ్చి రేసింగ్ ట్రాక్‌పైకి పంపించారు. అయిదుగురు సభ్యులు బృందం మహిళా రేసర్ల ఫిట్‌నెస్, కారు కంట్రోలింగ్, వేగం, లాప్ టైమ్స్‌ను పరిశీలించి ఆరుగురిని ఎంపిక చేసింది. మరో ఆరుగురిని రిజర్వులో ఉంచింది. ఫైనల్‌కు చేరిన ఆరుగురు మహిళా రేసర్లు జేకే టైర్ పోటీల్లో పాల్గొంటారు. ఫైనలిస్ట్‌ల్లో ఒకరైనా డాక్టర్ రితిక మాట్లాడుతూ ... తుది జాబితాలో ఉండడం చాలా సంతోషంగా ఉందన్నారు. తాను చాలా ఇష్టంగా చేసే పనుల్లో ఒకటైన రేసింగ్‌లో తనకు అవకాశం లభించిందని ఆనందం వ్యక్తం చేశారు. చాలా ధైర్యం కావాలని, ఇది మనలోని భయాల్ని పోగొడుతుందని అన్నారు. రేసింగ్‌పై ఉన్న ఆసక్తి తమను ఒకచోటికి చేర్చిందని, ఇక్కడికి వచ్చిన వారందరూ విజేతలేనని పోటీలో పాల్గొన్నా ఓ మహిళా వెల్లడించారు. రోషిణి, లియా దరన్, ప్రియంమేధ, మేఘా, హన్సుజ, రితికలు ఫైనల్‌కు చేరిన మహిళా రేసర్లు.

## కాలమ్

# మనుషులుగా జీవించండి

ఒకడేమో 2030 కల్లా భారతదేశాన్ని హిందూ దేశంగా చేస్తాం అంటాడు.. ఇంకోకడేమో 2035 కల్లా భారతదేశం ఇస్లాం దేశం అయిపోతుంది అని భయపెడతాడు..

ఇంకోకడేమో 2వ రాకడ, రక్షకుడే శిక్షకుడై వస్తున్నాడు, 2030 కల్లా మొత్తం క్రైస్తవంతో నిండిపోతుంది అంటాడు..

2030 – 2040 కల్లా ఈ భూమి ఉష్ణోగ్రత 58 – 60 డిగ్రీలకి చేరబోతుందిరా.. మీ హైందవ వీరులు, మీ క్రైస్తవ వీరులు, మీ ఇస్లాం వీరులు,, మీ మత రాజ్యాలు ఏర్పాటు చేయడానికి, శవాల కుప్పలు తప్ప,, మనుషులు మిగిలే పరిస్థితి లేదు..

**పీల్చుకోడానికి స్వచ్ఛమైన గాలి లేదు... కొనుక్కుని తాగితే తప్ప తాగగలిగే నీరు మిగలలేదు..** అయితే అతి వర్షాలు, లేకపోతే వర్షాభావ పరిస్థితులు.. భగభగ మండే ఎండలో నిలబడడానికి, నీడనిచ్చే చెట్టు మిగలలేదు.. తినే తిండి మొత్తం పురుగుల మందుల మయం.. భూమి మీద ప్లాస్టిక్ పొరలు పొరలు పెరుకుపోతున్నాయి.. నదులు మొత్తం మురుగు కాల్వలుగా మారుతున్నాయి.. సముద్రాలు అన్నీ మృత్యు కుహూరాలుగా మారుతున్నాయి.. కొత్త కొత్త జబ్బులు, క్యాన్సర్లు, వైరస్లు..,

ఇంకో పది సంవత్సరాల్లో ఈ దేశమే కాదురా,, ధ్రువ ప్రాంతాల్లో మంచుకొండలు కరిగి ఈ భూమ్మీద 40%నాగరికత అంతరించబోతుంది.. తుఫానులు, భూకంపాలు, పేదరికం, అంటురోగాలు ఈ ప్రపంచాన్ని సర్వనాశనం చేయబోతున్నాయి..

అంతా నాశనం అయ్యాక... అందరూ చచ్చాక.... ఇంకెక్కడ ఏర్పాటు చేస్తార్రా మీ మత రాజ్యాలు.. ఇంకా ఎవడికోసంరా మీ దేవుడి రాజ్యాలు... మన బిడ్డలు, వాళ్ళ బిడ్డలు,, హాయిగా సుఖంగా బ్రతకాలంటే,, కావలసింది,, ఈ దేవుళ్ళు, మతాలు కాదురా.... వ్యర్థాలు లేని భూమి కావాలి... స్వచ్ఛమైన గాలి కావాలి... కలుషితాలు లేని నీరు కావాలి...

**మీ తరువాతి తరాల మనసుల్లో విద్వేషపు విషబీజాలు నాటడం మాని... అందరూ కలిసి కనీసం తలోక చిన్న మొక్క నాటండిా..**

స్మశానాల మీద మతరాజ్యాల నిర్మాణం కోసం కాదు... సాటి మనిషిపట్ల, ప్రేమభావం, సమభావం గల, నవనాగరికతను నిర్మించడం కోసం ఆలోచించండి...

మతాలకు పుట్టిన వాళ్ళలాగా కాకుండా, మనుషులకు వాళ్లుగా జీవించండి....

## దుర్గగుడిలో ఏర్పాట్లు కట్టుదిట్టం



**రాజధాని వార్తలు ప్రతినిధి, విజయవాడ :** దసర నవరాత్రులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ బి.లక్ష్మీకాంతం వెల్లడించారు. దుర్గగుడిలో అక్టోబరు 10 నుంచి ప్రారంభమయ్యే దసరాకు సంబంధించి కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో జాయింట్ పోలీస్ కమిషనర్ టి.కె.రాణా, దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ యలమంచిలి గౌరంగబాబు, ఈవో వి.కోటేశ్వరమ్మ, వీఎంసీ కమిషనర్ జె.నివాస్, జాయింట్ కలెక్టర్ విజయ్‌కృష్ణన్‌లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గతేడాది సమన్వయంతో పని చేసి భక్తుల మెప్పు పొందామని,ఈ ఏడాది కూడా అలాగే పని చేయాలన్నారు. సెప్టెంబరు 25 నుంచే వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులను ఆకట్టుకునేలా వివిధ కార్యక్రమాలు రూపొందించాలన్నారు. దీనిలో భాగంగా ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు గ్రామంలో ఏర్పాటు చేయనున్న సీతాకోకచిలుకల పార్కును భక్తులు సందర్శించే విధంగా సన్నాహాలు చేస్తున్నామన్నారు. దసరా ఉత్సవాలకు విజయవాడ రెవెన్యూ డివిజనల్ అధికారి పి.బాబురావు ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తారన్నారు.

## శ్రీశైలంలో భారీ అగ్ని ప్రమాదం..


- రూ.15 లక్షల ఆస్తి నష్టం!
- ఆలయం ముందు భాగంలో మంటలు
- తీవ్రంగా శ్రమించి ఆర్పిన సిబ్బంది
- కేసు నమోదుచేసిన పోలీసులు



**శ్రీశైలం :** ప్రముఖ శైవ పుణ్యక్షేత్రం శ్రీశైలంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈవో ఆఫీస్ ముందుభాగంలో శుక్రవారం అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో ఆలయ ముందు ఏర్పాటుచేసుకున్న 15 దుకాణాలు కాలి బూడిద అయ్యాయి. ప్రమాద విషయం తెలిసిన వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది.. తీవ్రంగా కష్టపడి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

మంటలకు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న దుకాణాలలోని రూ.15 లక్షల విలువైన సరుకులు కాలి బూడిద అయ్యాయి. ప్రమాదం అనంతరం ఘటనాస్థలాన్ని ఆలయ ఈవో శ్రీరామచంద్రమూర్తి పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు హరికృష్ణ విగ్రహం
## ఎన్టీయార్‌కు అందజేత



**రాజధాని వార్తలు ప్రతినిధి, ఏలూరు :** దివంగత నటుడు, చైతన్య రథసారధి నందమూరి హరికృష్ణ విగ్రహాన్ని ఆయన కుమారుడు జూనియర్ ఎన్టీఆర్‌కు అందించనున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర మండలం నత్తారామేశ్వరానికి చెందిన ఏకేఆర్ట్స్ శిల్పులు డాక్టర్ పెనుగొండ అరుణ్ ప్రసాద్ ఉడయార్, కరుణాకర్ ఉడయార్‌లు హరికృష్ణ మీద అభిమానంతో ఆయన విగ్రహాన్ని రూపొందించారు. ఆదివారం హరికృష్ణ జయంతి సందర్భంగా ఈ విగ్రహాన్ని ఆయన చిన్న కుమారుడు, ప్రముఖ సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్‌కు అందజేయనున్నట్లు విగ్రహ రూపకర్తలు తెలిపారు.

## 6న మంత్రి మండలి సమావేశం : ఏపీ సీఎస్



**రాజధాని వార్తలు, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ మంత్రి మండలి సమావేశం ఈ నెల 6వ తేది సాయంత్రం 3 గంటలకు సచివాలయం 1వ బ్లాక్ మొదటి అంతస్తులోని కేబినెట్ సమావేశ హాలులో జరగనుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, అదే రోజు పోలవరం ప్రాజెక్ట్ పురోగతిని కేంద్ర బృందం పరిశీలించనుంది.

## 6న పోలవరం ప్రాజెక్టును సందర్శించనున్న కేంద్ర బృందం



**7న విజయవాడలో సమీక్ష**

**రాజధాని వార్తలు,అమరావతి:** ఈ నెల ఐదో తేదీన కేంద్ర జల సంఘం సాంకేతిక కమిటీ పోలవరం పర్యటనకు రానుంది. శర్మ నేతృత్వంలోని కమిటీ 5న విజయవాడ చేరుకుని 6న ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించనుంది. అనంతరం 7న విజయవాడలో ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహించనుంది. పోలవరం ప్రాజెక్టు భూసేకరణ, పునరావాస కమిషనర్ రేఖారాణి శుక్రవారం ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రాజెక్టు అంచనాలపై ఆమె పంపే నివేదిక ప్రకారం.. గతంలో ఇచ్చిన గణాంకాలు, కొత్త అంచనాల మధ్య తేడాలను ఈఎన్‌సీ బృందం పరిశీలిస్తుంది. ఈ నివేదిక పక్కాగా ఉందని కనుక కమిటీ భావిస్తే దానిని పోలవరం ప్రాజెక్టు అథారిటీ సభ్య కార్యదర్శి ఆర్‌కే గుప్తాకు పంపిస్తారు.


# రాజధాని క్లాసిఫైడ్స్

## నివాస ప్లాట్లు

**నవులూరు**
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో 500, 1000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ :9440662699

**రాయపూడి**
రాజధాని ప్రాంతంలోని రాయపూడి గ్రామ పరిధిలో 500, 1000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్: 9440662699

## ఇతరములు

ఓంశ్రీ సాయిరాం రిజిస్ట్రేషన్ కన్సల్‌టెన్సీ & సర్వీసెస్ అన్ని రకముల దస్తావేజులు, అగ్రిమెంట్లు వ్రాయబడును. స్టాంపులు అమ్మ బడును. అన్ని రకముల మోటారు వాహనములకు ఇన్సూరెన్స్ కట్టించు కొనబడును.
**పాపన చక్రవర్తి డాక్యుమెంట్ రైటర్**
ఫోన్ 9502424704, 08645 244992
సబ్ - రిజిస్ట్రార్ ఆఫీస్ ఎదురు, తుళ్లూరు

**వెంకటపాలెం**
సాయిలాస్య రియల్‌ఎస్టేట్ & ఫైనాన్స్ కన్సెల్టెన్సీ, గాదె నాగేశ్వరరావు
ఫోన్ : 95151 53939

**మందడం**
ఎస్.ఆర్.కె. గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : 9553023388

**వెలగపూడి**
సాయి గణేష్ ట్రేడర్స్: నిర్మాణ రంగానికిసిమెంట్, స్టీలు, పైపులు, పెయింట్‌లు అమ్మబడును.
ఫోన్ : 9640811333

**రాయపూడి**
కాకతీయ ఫుడ్ కోర్ట్
ఫోన్ 9848021898

**రాయపూడి**
రియల్‌ఎస్టేట్ క్రయ, విక్రయాలకు సంప్రదించడం న్యూసింగపూర్ రియల్ ఎస్టేట్
ఫోన్ : 98484 42436

**రాయపూడి**
చంద్రిక ట్రేడర్స్ నిర్మాణ రంగానికి సిమెంట్, స్టీలు,పైపులు అమ్మబడును.
ఫోన్ : 9908073516

## షాప్స్

**తుళ్ళూరు**
రేమాండ్స్‌ట్రైలర్స్
ఫోన్ : 9492470426

**తుళ్ళూరు**
వైభవ్ డ్రస్సెస్
ఫోన్ : 9848407935

**తుళ్ళూరు**
రాజా గోల్డ్ కవరింగ్
ఫోన్ : 9581500500

**తుళ్ళూరు**
శ్రీసాయి జ్యూయలరీ వర్క్స్
ఫోన్ :9247171083

**తుళ్ళూరు**
ఎస్.ఎమ్(స్టైల్ ఫర్ మెన్) ట్రైలర్స్
ఫోన్ 9440307123

**రాయపూడి**
ఖాజా ఖాదర్ రైస్ స్టోర్స్
ఫోన్ : 9603990791

**రాయపూడి**
వర్షిత ఫోటోస్టాట్
ఫోన్ : 9985853188

## హాస్పటల్స్

**విజయవాడ**
ఆంధ్ర హాస్పటల్, డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : 9177219900

**విజయవాడ**
న్యూఫేస్ కీనిక్ , డా॥మేహబూబ్
ఫోన్ : 9849122788

**విజయవాడ**
అష్రఫ్ మెటర్నిటీ & ఇ.ఎన్‌టి
డా॥ రెహమాన్
ఫోన్: 0866-2475087

**విజయవాడ**
శ్రీమానస సైకియాట్రిక్
డా॥ అయోధ్య ఆర్.కె
ఫోన్:0866-2436647

విశాఖపట్నం
చింతలూరు ఆయుర్వేద
డా॥ విశ్వనాథ్
ఫోన్ :90329 90138

## వాణిజ్య ప్లాట్లు

**నవులూరు**
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

**ఐనవోలు**
రాజధాని ప్రాంతంలోని ఐనవోలు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

## విద్యా సంస్థలు

**ఐనవోలు**
విఐటీ-ఏపీ యూనివర్శిసిటీ
ఫోన్ :0863 2370444

**నీరుకొండ**
ఎస్ఆర్ఎమ్ యూనివర్శిసిటీ
ఫోన్ :0863 2343000

**గమనిక : క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.**

**- మేనేజర్**

ప్రకటనలకు సంప్రదించండి 7680994755


## టమాట ధర ఢమాల్



**రాజధాని వార్తలు,గుంటూరు:** మార్కెట్లో టమాట ధర ఒక్కసారిగా పడిపోయింది. విఫణిలో అన్ని రకాల కూరగాయల ధరలు చుక్కలనంటుంతుంటే అనూహ్యంగా టమాట ధర మాత్రం నేలను తాకింది. బుధవారం బాక్సు (26 కేజీలు) టమాట ధర రూ.350 ఉంటే గురువారం దీని ధర రూ.200కు పడిపోయింది. దీంతో హెూల్‌సేల్ కూరగాయల మార్కెట్లో టమాట కిలో రూ.10 వంతున విక్రయించారు. ఆపై వ్యాపారుల మధ్య పోటీ పెరగడంతో దీని ధరను మరికాస్త తగ్గించి రూ.8కు విక్రయించారు. దీంతో రిటైల్‌లోనూ టమాట ధర కిలో రూ.12కు పడిపోయిన పరిస్థితి నెలకుంది. టమాట మినహాయిస్తే ఇతర కూరగాయల ధరలు ఏ మాత్రమూ తగ్గలేదు. హెూల్‌సేల్ మార్కెట్లో బెండ, దొండ, గోరు చిక్కుడు, పచ్చిమిర్చి రకాలు కిలో రూ.30 పలుకుతున్నాయి. ఇక బీర కాయ, కాకర నాణ్యతను బట్టి రూ.35 నుంచి రూ.40గా ఉంటే చిక్కుళ్లు రూ.55, క్యారెట్ రూ.65గా ఉన్నాయి. ఇక దోస, దుంప మాత్రం కిలో రూ.25 వద్ద నిలకడగా ఉన్నాయి.

**పెరుగుతున్న ఆకు కూరల ధరలు**

కూరగాయలతో పాటు ఆకు కూరల ధరల్లోనూ పెరుగుదల కన్పిస్తోంది. తోట, చుక్క, పాల కూరలు వంద (నాలుగు కట్టలు కలిపితే వంద) రూ.25 పలుకుతున్నాయి. దీంతో విడిగా వీటిని రూ.7కు విక్రయిస్తున్నారు. ఇక రిటైల్‌లోకి వచ్చే సరికి వీటి ధర డిమాండ్‌ను బట్టి కట్ట రూ.8 నుంచి రూ.10 పలుకుతుంది. ఇక వీటితో పాటు విక్రయించే కొత్తిమీర, పొదీ న కట్టల రేట్లు మాత్రం నిలకడగా ఉన్నాయి. కొత్తిమీర కట్ట రూ.10, పొదీనా రూ.5 వద్ద స్థిరంగా ఉన్నాయి.

## తాత్కాలిక ఉద్యోగులకు వేతనాలు పెంపు

**రాజధాని వార్తలు అమరావతి :** ఏపీ ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో 1993 నవంబర్ 25కు ముందు తాత్కాలిక ప్రాతిపదికన నియమితులైన ఫుల్‌టైమ్, పార్ట్‌టైమ్,ఎన్ఎమ్ఆర్, దినసరి ఉద్యోగుల వేతనాలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2015 పీఆర్‌సీ ప్రకారం వీరికీ వేతనాలు అందించనుండగా ఇప్పటి వరకు కనీస వేతనం కూడా లేనివారికి సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం వేతనాలు చెల్లించనుంది. ప్రభుత్వ నిర్ణయంతో 7వేల మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది.




# ప్లాస్టిక్‌పై నిషేధం...

**లక్షమంది ఉద్యోగాలు హాంఫట్**

**బెంగళూరు :** పర్యావరణానికి ప్లాస్టిక్ చేటు చేస్తుందనడంలో సందేహం లేదు.. అయితే వాటిని నిషేధించే సమయంలో దానిపై ఆధారపడి జీవిస్తున్న వారి పరిస్థితినికూడా ప్రభుత్వాలు పరిగణలోకి తీసుకోవాల్సి ఉంది. అలా కాకుండా ఆఘమేఘాలపై నిర్ణయాలను అమలు చేయడంతో లక్షలాది మంది నిరుద్యోగులవుతారు. ప్లాస్టిక్‌పై ఇప్పటికే అనేక రాష్ట్రాలు నిషేధిస్తే అనేక మంది రోడ్లపాలయ్యారు. ప్రస్తుతం ఈ నిషేధాన్ని కర్ణాటక కూడా అమలుకు చర్యలు చేపట్టడంతో లక్ష ఉద్యోగాలు ఉఫ్ మన్నాయని తెలుస్తోంది. ప్రభుత్వం ముందు చూపుతో వ్యవహరించి,వారికి గుడ్డ సంచులు ఏర్పాటు చేసుకుంటానికి, ముందునుంచి అనుమతులు, ఆర్థిక సహాయం చేసి ఉంటే ఈ పరిస్థితి దాపురించేది కాదు..

ప్లాస్టిక్ వినియోగంపై కర్ణాటక రాష్ట్ర సర్కారు నిషేధం విధించడంతో లక్షమంది ఉద్యోగులు తమ ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడ్డారని కర్ణాటక రాష్ట్ర ప్లాస్టిక్ అసోసియేషన్ వెల్లడించింది. ప్లాస్టిక్ పై సర్కారు విధించిన నిషేధానికి నిరసనగా ప్లాస్టిక్ పరిశ్రమల యజమానులు ఫ్రీడం పార్కు వద్ద ఆందోళన జరిపారు. నిషేధం వల్ల ప్లాస్టిక్ పరిశ్రమకు 20వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని పారిశ్రామికవేత్తలు చెప్పారు. ప్లాస్టిక్ పై నిషేధాన్ని ఎత్తివేయాలని ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు జనార్ధన్ డిమాండు చేశారు. పోలీసులు దాడులు చేస్తూ తమను వేధిస్తున్నారని పారిశ్రామికవేత్తలు ఆరోపించారు.

# త్వరలో ఎలక్ట్రిక్ బస్సులు

**అధికారులతో యాక్సిస్ ప్రతినిధుల భేటీ**




**రాజధాని వార్తలు,అమరావతి:** రాష్ట్రంలో రెండు, మూడు, నెలల్లో ఎలక్ట్రిక్ బస్సులు పరుగులు తీయనున్నాయి. విజయవాడలో పైలెట్ ప్రాజెక్టుగా రెండు బస్సులను నడపాలని అధికారులు నిర్ణయించారు. విజయవంతమైతే మరిన్ని బస్సులను నడపడమే కాకుండా తయారీ యూనిట్‌ను నెలకొల్పనున్నారు. విశాఖపట్నంలో జనవరిలో జరిగిన భాగస్వామ్య సదస్సులో ఎలక్ట్రిక్ బస్సుల ఉత్పత్తిపై ఏపీఎస్ఆర్టీసీ, ఏపీట్రాన్స్‌కో, నెడ్‌క్యాప్‌తో బెలారస్‌కు చెందిన యాక్సిస్ మొబిలిటీ సంస్థ ఎంఓయూ కుదుర్చుకుంది. ఇందులో భాగంగా సచివాలయంలో సంస్థ ప్రతినిధులతో రాష్ట్ర అధికారులు సమావేశమయ్యారు. పర్యావరణ పరిరక్షణతోపాటు డీజిల్ వినియోగాన్ని తగ్గించేదుకు ఎలక్ట్రిక్ వాహనాలను నడపాలని సీఎం చంద్రబాబు నిర్ణయించినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ తెలిపారు. ప్రజా రవాణాలో ఈ బస్సులు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వవరించారు. ఈ బస్సుల పనితీరుపై యాక్సిస్ సంస్థ ప్రతిరిధులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. సంస్థ ప్రతినిధి ప్రతినిధి రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎలక్ట్రిక్ బస్సుల తయారీలో 40 ఏళ్లకు పైగా అనుభవం ఉందని, వివిధ పరి మాణాల్లో ఈ బస్సులను తయారు చేస్తున్నామని, వీటిలో 75 నుంచి గరిష్టంగా 87 మంది ప్రమాణించే సదుపాయం ఉందన్నారు. ఒకసారి చార్జ్ చేస్తే 25 కిలోమీటర్ల వరకూ బస్సు ప్రయాణిస్తుం దన్నారు. విజయ వాడలో త్వరలోనే చార్జింగ్ యూనిట్‌ను నెలకొల్పనున్నట్లు చేప్పారు. వీటిలో ఏసీ సదుపాయంతో పాటు వైఫై, జీపీఎస్ వంటి అత్యాధుని సాంకేతికతను పొందుపరుస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర విద్యుత్‌శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, నెడ్‌క్యాప్ ఎండీ కమలాకరరావు, ఈడీబీ సీఈఓ కృష్ణకిశోర్, ఆర్టీసీ ఈడీ కోటేశ్వరరావు యాక్సిస్ మొబిలిటీ, బెల్కమ్ మాష్ సంస్థ ప్రతినిధులు పాల్గొనారు.

# మూగబోయిన గళం




**పేదల వాణి..నిస్సహాయుల ఆశాదీపం...అసహాయుల గళం.. నిఖార్సయిన జర్నలిజానికి కేరాఫ్ అడ్రస్ గౌరీ లంకేష్.. మూఢాచారాలు, అసమానత్వం, వివక్షలపై కలం జుళిపించిన హేతువాద పాత్రికేయం ఆమె సొంతం.. దళితులు, మైనార్టీలు, అణగారిన వర్గాలు, పౌరహక్కుల కోసం ఆమె తుదిశ్వాస వరకు పోరాడుతూనే ఉన్నారు. గోరక్షక దళాల ఆగడాలపై కన్నెర్ర చేశారు.. రాజ్యహింసపై ప్రశ్నించారు..ఇది సహించలేని మతోన్మాదులు ఆమెను బలితీసుకున్నారు. ప్రశ్నించేవారిని చంపుతారేమో కాని ప్రశ్నను చంపలేరని యావత్‌దేశం ఆమె వారసత్వాన్ని అందిపుచ్చుకుంది...**

(ఈనెల 5న గౌరీలంకేష్ మొదటి వర్ధంతి సందర్భంగా)

చిన్నతనం నుంచి జర్నలిజం అంటే అత్యాసక్తి కనబరిచే గౌరీ లంకేష్ పి.లంకేష్, ఇందిరలకు ప్రథమ సంతానం.. ఆమెకు చెల్లి కవితా లంకేష్ తమ్ముడు ఇంద్రజిత్ లంకేష్ ఉన్నారు. తండ్రి వృత్తిరీత్యా ఇంగ్లీషు లెక్చరర్‌కాగా, 1980 నాటికి వార్తాపత్రికలు తమ విశ్వసనీయతను కోల్పోవడంతో వ్యాకులత చెందిన ఆయన 'లంకేష్' టాబ్లాయిడ్ వార్తా పత్రికను ప్రారంభించారు. ఇందులో ప్రకటనలకు చోటు లేదు.. అంటే పూర్తిగా సొంత ఖర్చుతో పత్రికను ప్రచురించేవారు. 2000లో లంకేష్ మరణం తర్వాత ఆమె సోదరుడు, గౌరీ కలసి దాన్ని నడిపారు. అయితే మావోయిస్టులను జనజీవన స్రవంతిలోకి తీసుకురావాలని ఆమె చేసే ప్రయత్నాలు సోదరుడికి నచ్చకపోవడంతో వారు వేరుపడ్డారు. అప్పటి నుంచి ఆమె పేరుతోనే (గౌరీలంకేష్) పత్రిక నడుపుతున్నారు. 2008లో లో ఒక నగల దుకాణ దారుడిని మోసం చేశారని బీజేపీ నాయకులు ప్రహ్లాద్ జోషి, ఉమేష్‌దూషి,శివానంద్ భట్,వెంకట మిస్త్రీలను విమర్శిస్తూ దేవానంద్ జగపూర్ ఆమె పత్రికలో వ్యాసం రాయగా జోషి, దూషి వేర్వేరుగా ఆమెపై పరువునష్ట దావా వేశారు. 2016లో కోర్టు ఆమెకు రూ. 10 వేల అపరాధ రుసుంతోపాటు ఆర్నెల్లు జైలు శిక్ష విధించింది. బీజేపీ నాయకులు దుకాణ దారుడిని తమవైపు తిప్పుకున్నారని కోర్టుకు తెలిపినా ప్రయోజనం లేకపోయింది. అయితే ఆమెకు ఆరోజే బెయిలు లభించింది. ఈ కేసులో ఆశ్చర్యం గొలిపే విషయం ఏమంటే ఇదే వార్తను స్థానిక పత్రికలు ప్రచురించినా వారిపై కేసులు నమోదు కాలేదు.

ఆమె జర్నలిజం ప్రస్తానం 'టైమ్స్ ఆఫ్ ఇండియా' బెంగుళూరులో ప్రారంభం కాగ, ఆపై ఆమె భర్త చిదానంద్ రాజ్‌ఘట్టాతో కలసి ఢిల్లీ వెళ్లారు. ఆపై ఐదేళ్లకు ఆమె భర్త నుంచి విడిపోయి బెంగళూరు వచ్చి సన్‌డే మ్యాగజైన్‌లో తొమ్మిదేళ్లపాటు పనిచేశారు. 2014లో కర్ణాటకలోని సిద్ధరామయ్య ప్రభుత్వం ఆమెను మావోయిస్టులను జనజీవన స్రవంతిలోకి తీసుకువచ్చే కమిటీలో సభ్యురాలిగా అవకాశం కల్పించింది. దీనిపై బీజేపీ రాద్ధాంతం చేసినప్పటికీ ఆయన తన మనస్సు మార్చుకోలేదు. ఢిల్లీలోని ఈనాడు తెలుగు ఛానల్‌లో కూడా ఆమె పనిచేశారు. పత్రికా, భావవ్యక్తీకరణ స్వేచ్ఛ రక్షణకోసం ఆమె అహరహం శ్రమించారు. సైద్ధాంతిక విబేధాలపై చర్చ ఉండాలన్నదే ఆమె ఆకాంక్ష.

ఆడంబరాలకు, పొగడ్తలకు అలవాటైన ప్రభుత్వాలు ప్రశ్నిస్తే సహించలేకపోతున్నాయి.. తప్పుచూపితే కక్షకడుతున్నాయి.సామాన్య ప్రజలపై కండబలం..ధనబలం..మందిబలం చూపుతున్నాయి. అయితే ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభం అయిన పత్రికల బాధ్యతే ప్రజాస్వామ్య రక్షణ అని నాయకులు మరిచిపోయారు. వ్యవస్థలోని లోటుపాట్లను తెలియజెప్పడం జర్నలిస్టుల బాధ్యత.. వారు తమ ధర్మాన్ని నిర్వహించే పరిస్థితులు ప్రస్తుతం మన దేశంలో లేవు.. రూపాయి నానాటికీ పతనమై పేదరికంలోకి జారుతూ , మహిళా రక్షణలేని దేశంగా మారటమే కాకుండా పత్రికా స్వేచ్ఛను హరించే దేశాల్లో ఇరాక్, సిరియా తర్వాత భారతదేశమే ఉంది. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అసహనం ఆవరించి ప్రజల మాన,ప్రాణాలకు రక్షణ లేకుండా చేస్తోంది.

ప్రజలు బుల్లెట్లకు బయపడి పోతారనుకోవడం వారి భ్రమేనని ఆమె ఆశయాలు వారసత్వంగా తీసుకున్న ప్రజలు నిరూపించారు. ఒక్క కంఠం మూగబోతే వేయి గొంతుకలు నినదిస్తాయనే నిజాన్ని ప్రభుత్వాల ముందుంచాయి. కండబలం.. ధనబలంతో రాజ్యాధికారం చేపడదామని ప్రయత్నిస్తే ఓటమి తప్పదని చరిత్ర చెబుతోంది. నిరంకుశ అధికారానికి ప్రజలు భయపడి ఉంటే ఈప్రపంచాన్ని హిట్లరు పాలించేవాడు..

> **ప్రజాస్వామ్య రక్షణ పత్రికలదే అని నాయకులు మరిచిపోయారు. వ్యవస్థలోని లోటుపాట్లను తెలియజెప్పడం జర్నలిస్టుల బాధ్యత.. వారు తమ ధర్మాన్ని నిర్వహించే పరిస్థితులు ప్రస్తుతం మన దేశంలో లేవు.. రూపాయి నానాటికీ పతనమై పేదరికంలోకి జారుతూ , మహిళా రక్షణలేని దేశంగా మారటమే కాకుండా పత్రికా స్వేచ్ఛను హరించే దేశాల్లో ఇరాక్, సిరియా తర్వాత భారతదేశమే ఉంది.**

**Gauri Lankesh**
@gaurilankesh

**పాకిస్థాన్ ట్రిప్**
జిన్‌దాల్–షరీఫ్ స్టీల్ డీల్
**మంగోలియా ట్రిప్**
అదాని పవర్ డీల్
**మొజంబిక్ ట్రిప్**
అదాని గేట్స్ కోల్ మైన్+దాల్ ఇంపోర్ట్ డీల్
**ఆస్ట్రేలియా ట్రిప్**
అదాని మైనింగ్ డీల్
**రష్యా ట్రిప్**
అంబానీ గ్రూప్ గెట్స్ డీల్స్
**ఇస్రాయేలు ట్రిప్**
అదాని గెట్ యుఎఇ డీల్
**యుఎస్ఎ ట్రిప్**
ఫర్ రిలయన్స్ డీల్
**ఫ్రెంచ్ ట్రిప్**
అనిల్ అంబానీ డీల్



**నావి రెండు విజయాలు ఒకటి భక్తులను పిచ్చోళ్లను చేయటం, రెండు పిచ్చోళ్లను భక్తులుగా చేయటం.**

ఆమె మృతి చెందిన ఏడాదికి గౌరీ భర్త చిదానంద్ రాజ్‌ఘట్టా ఆమె వ్యక్తిత్వాన్ని తెలిపే పుస్తకం 'ఇల్‌లిబరేట్' ఇండియా అనే పుస్తకాన్ని రచించారు. ఆయన వాషింగ్టన్ పోస్టు, డీసీలో విదేశీ వ్యవహారాలపై ఆయన కాలమిస్టుగా ఉన్నారు. భర్త నుంచి విడిపోయాక ఆమె ఒంటరిగానే ఉంటున్నారు. ఆమెకు పిల్లలు లేరు. అయితే దళిత నాయకుడు జిగ్నేష్ మేవాని, వామపక్షనేతలు కన్హయకుమార్, ఉమర్ ఖలీద్, షేహ్లా రషిద్ షోరాలను ఆమె దత్తపుత్రులుగా చెప్పుకునేవారు..


2017 సెప్టెంబరు 5 సాయంత్రం 8 గంటలకు ఆఫీసు నుంచి బెంగుళూరులోని రాజేశ్వరి నగర్ ఇంటికి కారులో వెళ్లి గేటు వేస్తుండగా ద్విచక్రవాహనంపై వచ్చిన దుండగులు ఏడు రౌండ్ల కాల్పులు జరిపారు. ఆమె తల, మెడ, గుండెల్లోకి బుల్లెట్లు దూసుకుపోవడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. వారు హెల్మెట్లు పెట్టుకోవడంలో వారిని గుర్తించడం కష్టమైంది. రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో ఆమె అంత్యక్రియలు జరిగాయి. ఒక నిజాయితీ గల జర్నలిస్టును భారత్ కోల్పోయిందని బీబీసీ వ్యాఖ్యానించింది. ఆమెను హత్యచేసిన వారి ఆచూకీ చెబితే రూ. 10 లక్షలు ఇస్తామని సెప్టెంబరు 8న కర్ణాటక ప్రభుత్వం ప్రకటించింది. దబోల్కర్, కాల్బుర్గి, పన్సారేలను హత్యచేసిన హంతకులే ఈమెను కాల్చిచంపారని ప్రత్యేక దర్యాప్తు అధికారులు 2018 జూన్‌లో వెల్లడిస్తూ పరశురామ్ వాగ్‌మోర్ ఈ హత్యను చేశానని ఒప్పుకున్నట్లు వారు వెల్లడించారు. ఏకకాలంలో పత్రికారచనలు, ఆందోళనలను నిర్వహించడం ఆమెకే సాధ్యం. కలం యోధురాలు గౌరీలంకేష్‌కు అక్షర నివాళి.

– ఖాన్


## మానవతా వాదులను బలితీసుకున్న హిందుత్వవాదులు



**దబోల్కర్ :** మహారాష్ట్రకు చెందిన వైద్యుడు,సామాజిక వేత్త, హేతువాది,రచయిత అయిన నరేంద్ర అచ్యుత్ దబోల్కర్ అంధవిశ్వాసాలకు వ్యతిరేకంగా మహారాష్ట్ర అంధరాధ నిర్మూలన్ సమితిని స్థాపించారు. అంతేకాకుండా సామాజిక న్యాయం కోసం పరిశ్రమించారు. స్వయం ప్రకటిత స్వాములు, బాబాలను వ్యతిరేకించారు. హేతువాదుల ఫెడరేషన్‌కు ఆయన ఉపాధ్యక్షుడిగా కూడా ఉన్నారు. వర్ణవివక్షపై ఆయన పోరాటాలు చేశారు. 2013 ఆగస్టు 20న ఆయన ఉదయం మార్నినింగ్ వాకింగ్ చేస్తుండగా హిందూ మతోన్మాదులు ఆయనపై కాల్పులు జరిపారు. 2014లో ఆయన మరణానంతరం భారత ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ ప్రకటించింది.




**కాల్బుర్గి :** చదువులో ముందుండే కాల్బుర్గి ఎంఏలో బంగారు పతకం సాధించారు. హంపిలోని కన్నడ వర్సిటీకి వైస్ చాన్సలర్‌గా బాధ్యతలు నిర్వహించిన మల్లేశప్ప మడివలప్ప కాల్బుర్గి వచన కవిత్వం, చారిత్రక పరిశోధనల్లోను ఆయనది అందవేసిన చేయి. 2006లో ఆయనకు సాహిత్య అకాడమీ అవార్డు వరించింది. కర్ణాటకలోని లింగాయత్ వర్గానికి చెందిన ఆయన హిందూత్వం పేరుతో ఆధిపత్యకులాల అరాచకాలపై ఆయన గొంతెత్తారు. దీంతో అసహనవాదులు 2015 ఆగస్టు 30న ఆయన ఇంటివద్దనే ఆయనను కాల్చి చంపారు.



**పన్సారే :** మహారాష్ట్రలో వామపక్ష నాయకుడైన గోవింద్ పన్సారే టోల్‌గేట్లను నిరసించారు..శివసేన తరచూ శివాజీ గురించి ఆయన హిందుత్వం గురించి తప్పుడు వార్తలు ప్రచారానికి 'శివాజీ ఎవరు' అంటూ ఆయన రాసిన పుస్తకం అన్ని భాషల్లోకి అనువాదం అయింది.ఆయన రాసిన శివాజీ ఎవరు పుస్తకంలో ఆయన ముస్లింలను ఎన్ని పదవులు ఇచ్చాడు ? ఎంత లౌకికవాది అనే విషయంపై సమగ్రంగా పరిశీలించి,పరిశోధించి ఆ పుస్తకాన్ని రచించారు. ఆ పుస్తకం లక్షన్నర కాపీలు అమ్ముడైంది. మురికివాడల సమస్యలు, కులాల ఆధిపత్యం ఆయన నిరశిస్తూ కులాంతర,మతాంతర వివాహాలను ప్రోత్సహించాడు. అత్యంత పేదరికంలో పెరిగిన ఆయన లా చదివారు. జీవితకాలంలో 21 పుస్తకాలు రచించారు. 2015 ఫిబ్రవరి 15న ఆయన భార్యతోకలసి మార్నింగ్ వాక్ నుంచి తిరిగి వస్తుండగా సనాతన్ సంస్థకు చెందిన దుండగులు వారిపై కాల్పులు జరిపారు.భార్య ఉమకు తలలో బుల్లెట్లు దిగగా, ఆయనకు గుండెల్లో దిగాయి. వారిద్దరినీ కుటుంబ సభ్యులు ఆస్టెర్ ఆధార్ ఆసుపత్రికి తీసుకు వెళ్లగా నాలుగురోజులు ఆయన మృత్యువుతో పోరాడి ఓడిపోయారు. నెలరోజుల తర్వాత ఆయన భార్య ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు.

# హత్యలకు కిరాయి మూకలు




- ఐదు రాష్ట్రాల్లో 60 మందితో గ్యాంగ్
- ఒక్కో హత్యకు రూ.50 నుంచి 80 లక్షలు
- 36 మంది హేతువాదులు టార్గెట్
- గౌరీ లంకేష్ హత్య దర్యాప్తులో వెలుగుచూస్తున్న విషయాలు

సంచలనం సృష్టించిన ప్రముఖ జర్నలిస్టు, హేతువాది గౌరీ లంకేష్ హత్య కేసులో బెంగళూర్ ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) విచారణలో అనేక దిగ్భ్రాంతి కల్గించే వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి. గౌరీ లంకేష్ హత్యకు కుట్రపన్నారంటూ సిట్ బృందం ఇప్పటి వరకు ఆరుగుర్ని అరెస్ట్ చేసింది. వీరిలో గౌరీ లంకేష్‌ను కాల్చి చంపిన పరుశురామ్ వాగ్‌మారే తోపాటు హత్యకు సహకరించిన మరో ఐదుగురు నవీన్‌కుమార్, సుజిత్‌కుమార్, అమోల్‌కాలే, ప్రదీప్, మనోహర్‌లను అరెస్ట్ చేశారు. అరెస్ట్ తర్వాత వీరి ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. ఆ సోదాల్లో మహారాష్ట్రకు చెందిన అమోల్ కాలే ఇంట్లో చేతి రాతతో కూడిన డైరీలు దొరికాయి. వాటిల్లో ఆశ్చర్యం కల్గించే విషయాలు బయటపడ్డాయి. హిందూత్వ భావజాలన్ని వ్యతిరేకిస్తున్న హేతువాదులను చంపేందుకు ఓ పెద్ద నెట్‌వర్కే పనిచేస్తోందని ఆ డైరీల ద్వారా వెల్లడైంది. వీరికి పెద్ద ఎత్తున నిధులు కూడా అందుతున్నాయి.


ఒక్కో హత్యకు రూ. 50 నుంచి 80 లక్షల ముడుతున్నాయి. ఈ కిరాయి హంతకులకు ఆయుధాలను అందజేయడమే కాక ఒక్కొక్కరికి నెలకు రెండు నుండి మూడు లక్షల వరకు చెల్లిస్తున్నారు. ఒక్కొ హత్యకు ఎనిమిది నుండి పది మందిని వినియోగిస్తున్నారు. గౌరీ లంకేష్‌ను హ్యత చేసేందుకు ఎనిమిది నెలల నుంచి రెక్కి నిర్వహించారు. దాదాపు 80 లక్షల రూపాయలు ఖర్చు చేశారు. అదే విధంగా హేతువాదులు కల్బుర్గీ , పన్సారీలను కూడా చంపేశారు. ఈ మూడు హత్యలకు దాదాపు కోటిన్నర రూపాయలు ఖర్చు చేసినట్లు డైరీల్లో వెల్లడైంది. ఈ ముగ్గుర్ని చంపడానికి ఒకే తపాకీ ఉపయోగించారు. ఒకే రకమైన బుల్లెట్లను ఉపయోగించారు. దీంతో డైరీలు దొరకకముందే మూడు హత్యలను ఒకే గ్రూపు చేసి ఉంటుందని పోలీసులు అనుమానించారు. కర్ణాటకలోని మరో రచయిత, విమర్శకుడు కెవెస్ భగవాన్‌ను చంపేందుకు కూడా ప్రయత్నించారు. కానీ ఈ కుట్రను పోలీసులు చేధించారు.

**జాబితాలో 36 మంది హేతువాదులు**

హిందూత్వ ఉన్మాదాన్ని వ్యతిరేకించే హేతువాదులతో పాటు, వివిధ రంగాల్లో ఉన్న ప్రముఖులను చంపేందుకు ఈ కిరాయి హంతకులు ఒక జాబితాను తయారు చేశారు. ఈ జాబితాలో మరో 36 మంది ఉన్నారు. మహరాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, కేరళతో పాటు తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 60 మంది కిరాయి హంతకులు ఉన్నట్లు కర్నాటక పోలీసులు గుర్తించారు. వీరంతా ఒకే నెట్‌వర్క్‌గా పనిచేస్తున్నారు. హిందూ మత కార్యక్రమాల్లో చురుగ్గా ఉండి నేర మనస్థత్వం గల వ్యక్తులను హిందూత్వ సంస్థలు ముందుగా గుర్తిస్తాయి. వారికి డబ్బులిచ్చి ఆయుధాల వాడకంలో శిక్షణ నిస్తారు. ఎయిర్ గన్స్, తుపాకులు, పెట్రోలు బాంబులు ఎలా తయారు చేయాలో బెల్గాం, హుబ్లీ, పూనెలలో ట్రైనింగ్ ఇస్తున్నట్లు డైరీల్లో వెల్లడైంది. ట్రైనింగ్ తర్వాత రెచ్చగొట్టే ఉపన్యాసాలు ఎక్కువగా జరిగే హిందూ సభలకు పంపి వార్ని మరింత కఠోర హిందుత్వ వాదులుగా మారుస్తారు.

ఆ తర్వాత వారిని హేతువాదులను చంపేందుకు ఉపయోగిస్తారు. గౌరీ లంకేష్‌ను చంపిన పరుశురాం 2102లో తన స్వంత జిల్లా విజయపురాలో పాకిస్తాన్ జెండా ఎగురువేసి మత ఘర్షణలకు కారణమయ్యాడు. దీంతో అతన్ని ధైర్యవంతుడిగా గుర్తించి గౌరీ లంకేష్‌ను చంపడానికి నియమించారు. కాగా హేతువాదుల హత్యల వెనుక ఒక మాజీ సైనికాధికారి ఉన్నారని సిట్ అనుమానిస్తోంది. గౌరీ లంకేష్ హత్యకు ముందు నిందితులకు ఇతనే ధైర్యం నూరిపోశారని తెలుస్తోంది. ఈయనతోపాటు మరో ఇద్దరు మాజీ సైనికాధికారులు ఓ హిందూత్వ సంఘంలో సభ్యులుగా ఉన్నారని సిట్ చెబుతోంది. ఓ ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని, వార్ని పట్టుకుంటే అన్ని వివరాలు వెలుగులోకి వస్తాయని సిట్ పేర్కొంది.

# కృష్ణాష్టమి వేడుకలు



జన్మాష్టమి సంస్కృతం పదం. శ్రీ మహావిష్ణువు బ్రహ్మాండాన్ని ఉద్ధరించడానికి హిందూ ఇతిహాసాల ప్రకారం 8వ అవతారం శ్రీకృష్ణుడు జన్మదినం. కృష్ణ జన్మాష్టమిని లేదా గోకులాష్టమి లేదా అష్టమి రోహిణి అని కూడా పిలుస్తారు.శ్రీకృష్ణుడు దేవకి వసుదేవులకు 8వ సంతానంగా శ్రావణమాసము కృష్ణ పక్షం అష్టమి తిథి రోజు చెరసాలలో జన్మించాడు.

కృష్ణాష్టమి నాడు భక్తులు పగలంతా ఉపవాసం ఉండి, సాయంత్రం శ్రీకృష్ణుని పూజిస్తారు.శ్రావణ మాసంలో లభించే పళు ్ళ,అటుకులు, బెల్లం కలిపిన వెన్న, పెరుగు, మీగడ స్వామికి నైవేద్యం పెడతారు.ఉయాల కట్టి అందులో శ్రీకృష్ణ విగ్రహాల్ని పడుకోబెట్టి ఊపుతూ రకరకాల పాటలు, కీర్తనలు పాడతారు.పుర వీధుల్లో ఎత్తుగా ఉట్లు కట్టి పోటీపడి వాటిని కొడతారు. అందుకే ఈ పండుగని 'ఉట్ల పండుగ' లేదా 'ఉట్ల తిరునాళ ్ళ' అని పిలుస్తారు. భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జయంతి వ్రతంగా ఆచరిస్తే గోదానం చేసిన ఫలితం, కురుక్షేత్రంలో సువర్ణదానం చేసిన ఫలం దక్కుతుందని బ్రహ్మాండ పురాణం చెప్పింది. కలియుగంలో కల్మషాల్ని హరించి, పుణ్యాల్ని ప్రసాదించే పర్వదినం ఇదని కూడా వివరించింది.. దుష్టశిక్షణ.. శిష్ట రక్షణ... అన్న గీతోపదేశంతో మానవాళికి దిశానిర్దేశం చేశారు కృష్ణభగవానుడు. మహాభారత యుద్ధాన్ని ముందుండి నడిపించిన మార్గదర్శి ఆయన.

**సామూహిక వేడుకలు యాదవుల ప్రత్యేకం**

కృష్ణుడు అనగానే యాదవులు గుర్తుకొస్తారు. పండుగ రోజున ప్రత్యేక పూజలు చేసి గ్రామాల్లో, పట్టణాల్లోనూ వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. యాదవులు అత్యధికులు కలిగిన గ్రామాల్లో కృష్ణాష్టమికి ఒకరోజు ముందు నుంచే ఈ వేడుకల్లో నిమగ్నమవుతారు.అర్ధరాత్రి నుంచి వేడుకలను ప్రారంభిస్తారు. తమ చిన్నారులను బాల కృష్ణుడు, గోపికల వేషధారణలతో అందంగా అలంకరిస్తారు.కృష్ణుడి ప్రతిమకు ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించి సహపంక్తి భోజనాలతో వేడుకలను ముగిస్తారు.

**తిరుమల శ్రీవారి ఆస్థానంలో వేడుకలు**

తిరుమల ఆలయలో శ్రీనివాసుని ప్రక్కనే రజతమూరి శ్రీకృష్ణుని విగ్రహం పూజలందుకుంటూ ఉంటుంది. 11వ శతాబ్దానికి పూర్వమే కృష్ణుడి విగ్రహం ఉన్నట్లు శాసనాధారాలు చెబుతున్నాయి. పండుగరోజు సాయంత్రం శ్రీవారు ప్రత్యేకంగా కొలువుదీరుతారు. ఈ కొలువును 'గోకులాష్టమీ ఆస్థానం' అని వ్యవహరిస్తారు. సర్వాలంకార భూషితుడైన స్వామి సర్వభూపాల వాహనంలో ఆస్థానానికి విచ్చేస్తారు. పౌరాణికులు భాగవత పురాణంలోని శ్రీకృష్ణావతార ఘట్టాన్ని చదివి వినిపిస్తారు. మరునాడు నాలుగు మాడ వీధుల్లో శిక్యోత్సవం (ఉట్ల పండుగ) కోలాహలంగా జరుగుతుంది.

– బోస్

ఎన్టీఆర్ చైతన్యరథ సారథి

# హరికృష్ణ వీలునామా



సమైక్యఆంధ్రా అంతటా చైతన్యరథంలో తిప్పిన హరికృష్ణ అంటే తండ్రి ఎన్టీఆర్‌కు ఎంతో ఇష్టం .. ఎంతో కష్టమైన పరిస్థితుల్లో ఆయన ఎన్టీఆర్‌కు చేదోడు వాదోడుగా ఉన్నారు. వాస్తవానికి ఎన్టీఆర్ పార్టీని ప్రారంభించిన కొత్తలో ఆయనకు అన్నీతానై నడిపించింది హరికృష్ణ మాత్రమే.. ఇదే సమయంలో అయితే పదవిలోకి వచ్చిన తర్వాత, మంది,మార్బలం తోడైన తర్వాత హరికృష్ణ డ్రైవింగ్ అవసరం రామారావుకి లేనప్పటికీ హరికృష్ణ గురించి ఆయన చాలా గొప్పగా చెప్పేవారు. అయితే హరికృష్ణ చెప్పుడుమాటలు విని ఆవేశంతో దుందుడుకు నిర్ణయాలు తీసుకొని తండ్రికి దూరమయ్యాడు.. ఒకప్పుడు తన పిల్లలను ఎంతో క్రమశిక్షణతో పెంచానన్న ఆత్మసంతృప్తితో ఉన్న రామారావుకి ఆయన రాజకీయ చివరి అంకంలో పిల్లల తిరుగుబాటు, మరీ ముఖ్యంగా హరికృష్ణ నోటిదురుసుతనం ఆయన్ను ఎంతో కలవరానికి గురిచేసింది. అయితే ఆయన మరణానంతరం తన తప్పుతెలుసుకొని హరికృష్ణ అన్నా ఎన్టీఆర్ పార్టీ ప్రారంభించి ఎన్టీఆర్ గురించి ఆయన ప్రకటించినప్పటికీ అప్పటికే జరగవలసిన నష్టం జరిగిపోయింది. పాపం ఇది ఆయనను చివరివరకు చాలా తీవ్రంగా కలచి వేసిన అంశం.. హరికృష్ణ పెద్దకుమారుడు జానకీరామ్ కూడా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం మరోక విషాదం.. ఈ రెండు అంశాలతో ఆయన అస్వస్థతకు గురయ్యారు. మనవళ్లతో సమయం గడిపి కాస్త కోలుకుంటున్న సమయంలో ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం ఆ కుటుంబానికి తీవ్రశోకాన్ని మిగిల్చింది. మనవళ్లంతా కన్నీరు పెట్టడం ఆయనకు వారిపై ఉన్న ప్రేమను సాక్షాత్కరిస్తోంది. రోడ్డుప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన హరికృష్ణకు తెలంగాణ ప్రభుత్వ లాంఛనాలతో జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు జరిగాయి. సుప్రీంకోర్టు మాజీ జడ్జి జాస్తి చలమేశ్వర్, జయకృష్ణ, బాలకృష్ణ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయన పాడెను మోసిన వారిలో ఉన్నారు. హరికృష్ణ చితికి కల్యాణ్ రామ్ నిప్పం టించాడు. కుమారులిద్దరు ఆర్థికంగా లోటు లేనివారు కావడంతో తెలంగాణ ప్రభుత్వం ఆయనకు 450 గజాల స్థలంలో స్మృతిచిహ్నాన్ని నిర్మిస్తాననడం విమర్శలకు తావిస్తోంది. చంద్రబాబు రెండురోజులు సంతాప దినాలు ప్రకటించడంపై కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఆయన వీలునామా విషయానికి వస్తే రూ.20 కోట్లకు బీమా కట్టినట్లు తెలుస్తోంది. మొదట ఆయన తన ముగ్గురు కుమారులకు (జానకిరాం, కల్యాణరాం, జూ.ఎన్టీఆర్) సరిసమానంగా ఆ మొత్తాన్ని ఇవ్వాలనుకొన్నప్పటికీ రోడ్డు ప్రమాదంలో జానకిరామ్ మృతి చెందడంతో ఆ మొత్తాని ఆయన కుమారులకు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు ఆయన ఇద్దరు కుమారులతో చెప్పారని, దానికి వారిద్దరూ అంగీకరించినట్లట్లు కూడా తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న ఇల్లు కూడా కుమారులకే చెందేటట్లు ఆయన వీలునామా రాశారని, అయితే శంషాబాద్ ఫాంహౌస్ మాత్రం ముగ్గురు కుమారులకు చెందేట్లుగా అందులో ఉన్నట్లు సమాచారం.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2016-18, Cell 9440662699, Email : rajadhanivartalu1@gmail.com